సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



సోమశిలలో 52.7 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 52.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 10,520 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. 96.793 మీటర్ల మట్టం నమోదయింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,100
3 శాతం జీఎస్టీతో	రూ.7,313
నవర (8 గ్రా)	రూ.58,504

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /28.8

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం తేమగా ఉండి అక్కడక్కడ కొద్దిపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 72 శాతంగా సోమవారం నమోదైంది.

న్యూస్‌రీల్

చర్మ కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



మాధవికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

పొదలకూరు: చర్మ కేన్సర్ బాధితురాలికి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలసి ఆర్థిక సాయం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గతనెల 25న సాక్షిలో 'అసలే పేద..ఆపై కేన్సర్' శీర్షికన పసుపులేటి మాధవి దయనీయ గాథ ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం 2004–05 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు, అప్పటి విద్యాభారతి కోచింగ్ సెంటరు ఉపాధ్యాయులు స్పందించి మాధవికి రూ.లక్ష చెక్కును అందజేశారు. అప్పటి ఉపాధ్యాయులు ఎస్కే సుభాన్, ఎస్కే మహ్మద్, డి.రవీంద్రకుమార్, నరేంద్రరెడ్డిల సహకారంతో ఈ సాయాన్ని చేశారు. పూర్వ విద్యార్థులు రవికుమార్, రమేష్, చిన్నమస్తాన్, అంకయ్య, సతీష్, కరిముల్లా, ఏడుకొండలు పాల్గొన్నారు. స్థానిక ఎస్వీబీవీడీ డిగ్రీ అండ్ జూనియర్ కాలేజీ డైరెక్టర్ నరేంద్రరెడ్డి చర్మ కేన్సర్‌తో బాధపడుతున్న మాధవికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కె.మహబూబ్‌బాషా

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అడవుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడతానని జిల్లా అటవీ శాఖాధికారి కె.మహబూబ్ బాషా తెలిపారు. డీఎఫ్‌ఓగా నియమితులైన ఆయన సోమవారం వేదాయపాళెంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు రేంజర్లు, డిప్యూటీ రేంజర్లు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన రేంజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అడవుల్లోకి ప్రవేశించి కలప, ఇతర వనరులకు నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వన్యప్రాణులను వేటాడే వారిపై రేంజర్లు, కిందిస్థాయి సిబ్బంది ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అటవీ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాపూరు రేంజర్ రవీంద్రబాబు, నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

టమోటా @100



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న కావలి రైతుబజారు



కావలి: కూరగాయల ధరలు కొండెక్కాయి. వినియోగదారులకు దడ పుట్టిస్తున్నాయి. మండుతున్న ధరలను చూసి ప్రజలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. నెల కిందట రూ.30 ఉన్న కిలో టమోటా ధర నేడు రూ.100కు చేరుకుంది. పచ్చిమిర్చి ధర రూ.50 అయింది. జాతీయ పోషకాహార సంస్థ లెక్కల ప్రకారం రోజూ ప్రతి ఒక్కరు కనీసం 350 గ్రాముల కూరగాయలు తినాలి. కానీ రేట్లు పెరిగి సామాన్యుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కావలిలో భగ్గుమంటున్న ఎండలతో పాటే కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. కావలిలోని రైతు బజార్‌లో కూరగాయలు అమ్మకాలు చేసే దుకాణాల్లోని పట్టికల్లో ప్రతి రోజూ ధరలు రాయాల్సి ఉంది. కానీ కొనుగోలుదారులు ధరలు చూస్తే కొనడానికి ఆసక్తి చూపరనే భావంతో ధరల పట్టికల్లో రేట్లు వేయకుండా ఖాళీగానే వదిలేశారు.

కొనే పరిస్థితి లేదు



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. రైతుబజార్‌లోనూ ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు. టమోటా కిలో రూ.100 ఉండగా ఇతర రకాల కూరగాయలు రూ.50కి తక్కువ లేవు. పెరిగిన ధరలతో కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. కిలోల చొప్పున కొనుగోలు చేసేది, ఇప్పుడు పావు కిలో, అర కిలోతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి.

–రత్నమ్మ, కావలి

బేల్దారి.. బతుకు ఎడారి

ఇసుక కొరతతో స్తంభించిన నిర్మాణ రంగం

- గడిచిన మూడు నెలల్లో పదిరోజులు కూడా దొరకని పని
- పనికోసం రోజూ రోడ్డెక్కడం.. అడిగే వారు లేక వెనక్కి వెళ్లడం
- కొందరు బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు వలస
- గత ప్రభుత్వంలో రోజూ పనులు
- కూటమి ప్రభుత్వంలో కూటికీ దిక్కులేదు
- ఇదీ.. భవన నిర్మాణ కార్మికుల దుస్థితి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/నెల్లూరు (బారకాసు):

■ పొద్దుపొద్దున్నే తట్ట, బుట్ట తలపై పెట్టుకుని.. పచ్చడి మెతుకులు క్యారేజీలో నింపుకుని... రోడ్డెక్కి కూలి పనుల కోసం ఎంతసేపు వేచి ఉన్నా.. పిలిచే నాథుడు కనిపించడంలేదు.

■ రెండు గంటల పాటు రోడ్డుపైనే నిల్చుని.. దేవుడా ఈ రోజైనా పని చూపించి కనికరిస్తే పొట్ట నింపుకుంటామని చేతులెత్తి మొక్కుకుంటున్నా ఫలితం ఉండటం లేదు.



నెల్లూరు కొండాయపాళెం గేటు వద్ద కూలి పనుల కోసం వేచి ఉన్న భవన నిర్మాణ కార్మికులు



పని దొరక్క ఇంటికి వెళుతున్న మహిళా కూలీ

ఇదీ నెల్లూరు నగరంలో మూడు నెలలుగా భవన నిర్మాణ కూలీల దీనస్థితి. ఉచిత ఇసుకంటూ ఊదరగొట్టి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. నాలుగు నెలలు అవుతున్నా ఇసుక సరిగా అందివ్వలేకపోతోంది. అసలు దొరకడమే గగనంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చివరి రోజుల్లో యార్డుల్లో డంపింగ్ చేసిన ఇసుకను టీడీపీ నేతలు కరిగించేశారు. అనంతరం పెన్నాలో ఇసుకను డ్రెడ్జింగ్ చేసి రవాణా పేరుతో బ్లాక్‌లో తరలించేశారు. దీంతో జిల్లా అవసరాలకు ఇసుక లేక భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం డంపింగ్ యార్డుల్లో కొంతమేర ఇసుక నిల్వలున్నా ఆంక్షలు దాటి తెచ్చుకోవడం కష్టంగా ఉంది. ఇసుక దొరకడం గగనంగా మారడంతో తెలుగు తమ్ముళ్లు బ్లాక్ చేసిన సరుకు రేటును మూడింతలు పెంచేశారు.

స్తంభించిన నిర్మాణ రంగం

జిల్లాలో గడిచిన మూడు నెలలుగా ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగం స్తంభించింది. జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న దాదాపు 2,250 పైగా భవన నిర్మాణాలు నిలిపివేశారు. ఒక యూనిట్ ట్రాక్టర్ ఇసుక నెల్లూరు నగరంలో ప్రస్తుతం రూ.10 వేలు పలుకుతోంది. అదీ దళారుల ద్వారా బ్లాక్‌లో మాత్రమే దొరుకుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక ట్రాక్టర్ రూ.3 వేల నుంచి రూ.4 వేల లోపు వచ్చేది. ప్రస్తుతం బడ్జెట్ భరించలేక భవన యజమానులు నిర్మాణాలు నిలిపివేశారు.

కూలి లేక పూట గడవక..

నెల్లూరు నగరంలో దాదాపు 5 వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కూలీలుగా పనిచేసేందుకు వచ్చినవారే. వీరు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే అన్నం డబ్బా చేతపట్టుకుని బేల్దారి పనుల కోసం రోడ్డెక్కుతారు. మేస్త్రీలు వచ్చి తమకు కావాల్సిన వారిని తీసుకెళ్లి వారి చేత పనిచేయించుకుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తే మహిళా కూలీకి రూ.700, పురుషుడికి రూ.900 ఇస్తారు. వారంలో ఐదు రోజులు పని ఉన్నా వారికి సాపాటుకు దిగులుండదు. కానీ గత మూడు నెలలుగా భవన నిర్మాణాలు నిలిచిపోవడంతో బేల్దారి పనులకు పిలిచే నాథుడు లేడు. దీంతో ప్రతిరోజూ పనికోసం ఉదయాన్నే రోడ్డెక్కడం.. కూలీకి పిలిచేవారు లేక వెనుతిరగడం పరిపాటిగా మారింది.

వలస బాట

కూటి కోసం వచ్చిన వారికి పనులు లేక ఉపాధి కరువైంది. దీంతో కొందరు వలస బాట పడుతున్నారు. చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు కూలి పనుల కోసం వెళ్తున్నారు. గత రెండు నెలల వ్యవధిలోనే వెయ్యి మంది కూలీలు వలస వెళ్లినట్లు తోటి కూలీలే సాక్షితో చెప్పారు.

కూలీల ఆకలి కేకలు

పనులు లేక తాము పస్తులుంటున్నట్లు బేల్దారి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలో రెండు మూడు రోజులు మాత్రమే పని దొరుకుతోందని, మిగిలిన రోజుల్లో పని దొరక్క రోజులో ఒక పూట మాత్రమే కడుపు నింపుకుంటున్నామని వారు వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో పని దొరికేదని, ఒకవేళ వర్షాకాలంలో పనులు దొరక్కపోతే సంక్షేమ పథకాల డబ్బులు అకౌంట్లలో పడితే వాటితో కుటుంబం హాయిగా నడిచిపోయిందని చెప్పారు. ప్రస్తుతం బేల్దారి పనులు లేకపోవడంతో ఇళ్లల్లో పాచిపని చేస్తూ కడుపులు నింపుకుంటున్నామని కొందరు మహిళా కూలీలు చెప్పారు.



పనులకు పిలిచేవారి కోసం వేచి ఉన్న మహిళా కార్మికులు



అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇలాంటి నిర్మాణాలు ఎన్నో...



ఇంటి నుంచి క్యారేజీలతో పనుల కోసం వస్తున్న మహిళలు

ఆత్మహత్యలు తప్పవేమో



ఇసుక కొరత వలన 90శాతం భవన నిర్మాణాల పనులు ఆగిపోయాయి. మాలాంటి కార్మికులకు పనులు లేకుండా పోయాయి. పనులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ చివరకు పస్తులుండాల్సిన పరిస్థితి. ఇదే విధంగా మరి కొన్ని రోజులు గడిస్తే మాలాంటి కార్మికులు కుటుంబాన్ని పోషించుకోలేక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.

– భీముడు

అప్పులపాలైపోయాం



భవన నిర్మాణ పనులు లేకపోవడంతో పూట గడవడం కష్టమైపోయింది. కొద్ది రోజుల క్రితం వరకు పనులు బాగానే ఉన్నాయి. ఎప్పుడైతే ఇసుక కొరత ఏర్పడిందో అప్పటి నుంచి పనులు లేకుండా పోయాయి. దీంతో కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు తీర్చే పరిస్థితి కనిపించకపోవడంతో ప్రస్తుతం నాతో పాటు అనేక మంది అప్పులపాలైపోయాం.

– వెంకటేష్

మాకిది గడ్డు పరిస్థితి



నేను కొన్ని సంవత్సరాల నుంచి కూలి పనికి పోతున్నా. గతంలో ఎప్పుడూ పనులు లేకుండా లేదు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఇసుక కొరత వలన పనులు లేకుండా పోయాయి. నాలాంటి చాలా మంది భవన నిర్మాణ కార్మికులు ఇప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి గడ్డు పరిస్థితులు ఎప్పుడు చూడలేదు.

– జయమ్మ, భవన నిర్మాణ కార్మికురాలు



కొండాయపాలెం గేట్ వద్ద పనుల కోసం వేచిఉన్న కార్మికులు

ఇసుక ధర కొండెక్కింది



ఇసుక ధరలు అధికంగా ఉండటంతో యజమానులు నిర్మాణాలు చేపట్టడం లేదు. గత ప్రభుత్వంలో సాధారణ ఇసుక టన్ను ధర రూ.750 దాకా ఉంటే ప్రస్తుతం రూ.వెయ్యి ఉంది. అదేవిధంగా ప్లాస్టరింగ్ ఇసుక టన్ను ధర గతంలో రూ.900 ఉంటే ప్రస్తుతం రూ.1,200 ఉంది. ఇసుక తగినంతగా దొరక్కపోవడంతో సరిగ్గా పనులు సాగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– పల్లంరాజు

పస్తులతో బతుకుతున్నాం



ఇసుక కొరత మా కుటుంబాలను పస్తులు పెడుతోంది. భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఎక్కువ ధరలు పెట్టి ఇసుక కొనుగోలు చేయాల్సి రావడంతో యజమానులు నిర్మాణాలను వాయిదా వేసుకుంటున్నారు. రెండు నెలల నుంచి ఇసుక తీవ్ర కొరతగా మారింది. నిర్మాణ పనులే జీవనాధారం అయిన మాపరిస్థితి దారుణంగా ఉంది. పనులు లేకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది.

– లక్ష్మమ్మ

పనుల్లేక అవస్థలు



గత మూడు నెలలుగా పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఇసుక కొరత వలన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కొద్ది మంది మాత్రమే అదికూడా ఎవరైతే కోటీశ్వరులున్నారో వారు నిర్మించే భవన నిర్మాణాల వద్ద మాత్రమే పని ఉంది. నాలాంటి కార్మికులు ఎంతో మంది పనికోసం ప్రయత్నం చేస్తున్నారు. కొందరికే దొరుకుతోంది. అనేకమంది పనులు లేక అవస్థలు పడాల్సి వస్తోంది.

– ఎర్రయ్య

గత ప్రభుత్వంలో పనులుండేవి




నాకు తెలిసినప్పటి నుంచి కార్మికులకు పనులు లేకుండా ఎప్పుడూ లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ పనులుండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతనే పనులు లేకుండా పోయాయి. ఇసుక అధిక ధర వలన యజమానులు భవన నిర్మాణాలు నిలిపివేశారు. దీంతో కార్మికులకు పనులు లేకుండా పోయాయి. చేతిలో చిల్లిగవ్వ లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– చంద్రమ్మ

విద్యార్థులు సరే.. బోధకులేరీ?

విద్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. ప్రతి మండలంలో జూనియర్ కళాశాలలు ఉండాలనే లక్ష్యంతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు బయటకు వెళ్లకుండా అదే పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుకునే విధంగా జూనియర్ కళాశాలలను మంజూరు చేసింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా.. ఇంత వరకు ఆ కళాశాలల్లో అధ్యాపకుల నియామకాన్ని చేపట్టలేదు.



జూ.కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయిన జెడ్పీ పాఠశాలల్లో ఇదీ పరిస్థితి

- విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు దాటినా అధ్యాపకుల నియామకం చేపట్టని ప్రభుత్వం
- పాఠశాలల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు అదనంగా ఉన్నా సర్దుబాటు చేయని వైనం
- టీసీలు ఇస్తే వెళ్లిపోతామంటున్న విద్యార్థులు

కందుకూరు రూరల్: ప్రభుత్వ విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం కుప్ప కూల్చేస్తోంది. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే విద్యారంగాన్ని గాలికి వదలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే పిల్లలకు అమ్మఒడి పథకం ద్వారా ప్రభుత్వ విద్యను ప్రోత్సహించింది. ఆపై ఉన్నత చదువులకు సైతం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో వెన్నుదన్నుగా నిలబడింది. పాఠశాల స్థాయి నుంచి సీబీఎస్‌ఈ నుంచి టోఫెల్ స్థాయిలో విద్యాబోధన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇదే సమయంలో ప్రతి మండలానికి ఇంటర్మీయట్ కళాశాల ఉండాలని భావించింది. జిల్లాలో అల్లూరు, అనంతసాగరం, ఇందుకూరుపేట, జలదంకి, కొడవలూరు, ముత్తుకూరు, సంగం, సైదాపురం, వరికుంటపాడు, వింజమూరు, గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలగా అప్‌గ్రేడ్ చేసి ప్రారంభించింది. ఈ కళాశాలల్లో ఈ ఏడాది విద్యా సంవత్సవరం నుంచే కో–ఎడ్యుకేషన్ తరగతులు ప్రారంభించింది.

టీసీలు ఇవ్వాలని రోడ్డెక్కి నిరసనలు

నాలుగు నెలలుగా ఇంటర్ తరగతులు ప్రారంభం కాకపోవడంతో టీసీలు ఇస్తే వెళ్లిపోతామని విద్యార్థులు గత నెల 28న రోడెక్కి నిరసన తెలిపినా విద్యాశాఖాధికారులకు చలనం లేకుండా పోయింది. కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలను ప్రారంభించారు. చుట్టు పక్కల గ్రామాలు తిరిగి పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను కళాశాలలో అడ్మిషన్లు చేయించారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో 28 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఉపాధ్యాయులు ప్రత్యేక క్యాంపెయిన్ చేసి ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు చేయించారు. ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో ఎనిమిది మంది విద్యార్థులు, సీఈసీ తెలుగు మీడియంలో 20 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఎంపీసీలో తెలుగు, ఇంగ్లిషు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సీఈసీలో కామన్ సబ్జెక్ట్‌లతో పాటు సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్ట్‌లకు అధ్యాపకులను నియమించాల్సి ఉంది. అయితే తెలుగు, ఇంగ్లిషు సబ్జెక్ట్‌లను పాఠశాల ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు. మెయిన్ సబ్జెక్ట్‌లకు ఇప్పటి వరకు పాఠ్యాంశాలు మొదలు కాలేదు. ప్రకాశం జిల్లాలో హైస్కూళ్లలో పనిచేసే అర్హులైన ఉపాధ్యాయులను నియమించారు. వారిని కూడా సర్దుబాటులో తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో మాత్రం సర్దుబాటు చేయకపోవడం అంతర్యం ఏమిటిలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కందుకూరు డివిజన్ పరిధిలో హైస్కూల్‌లో అదనంగా ఉన్న అర్హులైన సబ్జెక్ట్ ఉపాధ్యాయులు జూనియర్ కళాశాలలకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విద్యాశాఖాధికారులు మాత్రం పట్టించు కోవడం లేదు.

అధ్యాపకుల నియామకం ఊసేలేదు

విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు అవుతున్నా అప్‌గ్రేడ్ అయిన ఇంటర్ కళాశాలల్లో అధ్యాపకుల నియామకం చేపట్టలేదు. పాఠశాలల్లో ఉండే ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పమంటే తమ వల్ల కాదు ఆ పాఠ్యాంశాలు తాము బోధించలేమంటున్నారు. పదో తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులు ఇంటర్మీడియెట్ సబ్జెక్ట్‌లు చెప్పాలంటే ఇబ్బందిగానే ఉంటుంది. ఉన్నత పాఠశాల్లో పీజీ చేసిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులు అదనంగా ఉంటే వారిని జూనియర్ కళాశాలలకు బదిలీ చేయాల్సి ఉంది. అయితే పాఠశాల్లోని అదనపు ఉపాధ్యాయులను పాఠశాలల వరకు సర్దుబాటు చేశారు. కానీ పాఠశాల నుంచి కళాశాలకు బదిలీ చేయడంలో జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. కనీసం డిప్యుటేషన్‌పై కూడా కళాశాలలకు పంపించకుండా పలు కారణాలు చెప్తున్నారు. కళాశాలలు ప్రారంభించి నాలుగు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు బోధనా సిబ్బందిని నియమించక పోవడంపై విద్యావేత్తలు పలు విమర్శలు చేస్తున్నారు.



తరగతి గదిలో విద్యార్థులు

విద్యాబోధన సక్రమంగా లేదు



ప్రభుత్వ జూనియర్ కళాశాల అని చెప్పి నన్ను ఇక్కడ చేర్పించారు. కానీ అన్ని సబ్జెక్ట్‌లకు అధ్యాపకులను నియమించలేదు. తరగతులు ప్రారంభమై నాలుగు నెలలు అవుతున్నా.. ఇప్పటి వరకు పాఠ్యాంశాల బోధన ప్రారంభం కాలేదు. తెలుగు, ఇంగ్లిషు సబ్జెక్ట్ పాఠశాలలో ఉండే వారు ఒక అవర్ చెబుతున్నారు. మిగిలిన సబ్జెక్ట్‌ల పరిస్థితి ఏమిటి. మేం దూరం ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ కళాశాలలో చేరినా ప్రయోజనం లేకుండా పోతోంది.

– ఎ.మాలతి, సీఈసీ విద్యార్థిని

నిరసన తెలిపినా స్పందించ లేదు



గత నెలలో విద్యార్థులమంతా రోడ్డెక్కి నిరసన తెలిపాం. అధ్యాపకులను నియమిస్తామని హెచ్‌ఎం తెలిపారు. కానీ ఇంత వరకు సబ్జెక్ట్ అధ్యాపకులను నియమించలేదు. పాఠశాలలో కామర్స్ సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేరు. అధ్యాపకులను నియమించాలి. విద్యార్థుల భవిష్యత్తు గురించి అధికారులు పట్టించుకోవడం లేదు.

– జి.శ్రీకాంత్, సీఈసీ విద్యార్థి

త్వరలో ఉత్తర్వులు వస్తాయి

ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. అదనంగా ఉన్న వారిని కళాశాలలకు పంపించాలంటే జూనియర్ కళాశాలల జాయింట్ డైరెక్టర్ అనుమతులు కావాలి. వారి అనుమతుల నిమిత్తం నివేదిక పంపించాం. త్వరలో ఉత్తర్వులు వస్తాయి. సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

– రాఘురామయ్య, ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓ

దూరం నుంచి వచ్చాం.. కనికరించండి

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- వినతులు అందించిన ప్రజానీకం


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): 'చాలా దూరం నుంచి వచ్చాం సార్. మాపై కనికరం చూపి అర్జీలకు పరిష్కారం చూపండి' అని ప్రజలు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. కలెక్టర్ ఆనంద్, డీఆర్వో లవన్న, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావులు వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి అధికంగా 126 అర్జీలు, మున్సిపల్ శాఖవి 39, పంచాయతీ రాజ్ శాఖవి 21, పోలీస్ శాఖవి 19, సర్వేకు సంబంధించి 15 అర్జీలు వచ్చాయి.

- కోవూరు షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం ప్రతినిధులు, సీపీఎం కోవూరు మండల కమిటీ నాయకులు కోరారు. 15 మండలాల పరిధిలో 3,845 మంది వాటాదారులతో 1979లో మొదలైన ఫ్యాక్టరీ రోజుకు 2,500 టన్నుల గానుగ ఆడే సామర్థ్యం కలిగి ఉందన్నారు. వందలాది రైతు కుటుంబాలు, భారీ సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు రోజువారి కూలీలు ఆధారపడిన షుగర్ ఫ్యాక్టరీని మూసివేయడం దారుణమని పేర్కొన్నారు. వెంటనే తెరిపించాలని కోరారు.
- దళితుల భూములను కాపాడాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటి మాజీ సభ్యుడు కాపోల్లు రఘు విజ్ఞప్తి చేశారు.
- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ జేఏసీ జిల్లా శాఖ ప్రతినిధులు కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారం ఏబీసీడీలుగా వర్గీకరించాలని వారు వినతిపత్రం అందజేశారు.
- గుజరాత్ సోమ్‌నాథ్‌లో కూల్చిన మసీదులు, దర్గాలు, ముఫాసిర్ ఖానా, సయ్యద్ శ్మశానాన్ని తిరిగి నిర్మించాలని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కలెక్టర్ ఎదుట నిరసన తెలిపారు. అక్కడి కలెక్టర్, ఎస్పీపై చర్యలు తీసుకోవాలన్నారు.

రికార్డుల్లో పేర్లు మార్చారు


కలెక్టర్‌తో మాట్లాడుతున్న దృశ్యం

నిబంధనలకు విరుద్ధంగా అడంగల్ తొలగించారని మర్రిపాడు మండలం పొంగూరుకు చెందిన మాదాల సుబ్బారావు కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు రికార్డుల్లో పేర్లు మార్చారన్నారు. తమ భూమికి సర్వే నిర్వహించి హద్దురాళ్లు ఏర్పాటు చేయించి స్వాధీనం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బతుకుదెరువు చూపాలని కోరుతూ..



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పాకూరుపల్లికి చెందిన విజయలక్ష్మి. రాపూరు మండలం పాకూరుపల్లి వాసి. వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. ఆమె భర్త కేన్సర్ బారిన పడి మంచం పట్టాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఉద్యోగం కల్పించాలంటూ ఆమె చంటి బిడ్డతో కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చింది. ఎంబీఏ వరకు చదువుకున్నానని, కండలేరు ముంపు నిర్వాసితుల కోటాలో రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగం రాలేదని విజయలక్ష్మి వాపోయింది. ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని కోరింది.

ఉద్యోగాల పేరిట మోసాలు


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

- పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- అర్జీలు స్వీకరించిన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'ఉద్యోగాలు ఇప్పిస్తామని నగదు తీసుకుని మోసం చేశారు. దీనిపై స్పందించి న్యాయం చేయాలి' అంటూ పలువురు బాధితులు పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఇందులో 97 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల సమస్యలను తెలుసుకున్న ఎస్పీ జి.కృష్ణకాంత్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో విచారించి సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నియామక పత్రాలిచ్చి..

- కలువాయి మండలానికి చెందిన రజిత బ్యాంకుల్లో ఉద్యోగం ఇప్పిస్తానని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ వద్ద రూ.9 లక్షలు, వెంకటాచలానికి చెందిన వ్యక్తి వద్ద రూ.17 లక్షలు నగదు తీసుకుని నకిలీ నియామకపత్రాలు అందించింది. వారు మోసపోయామని గ్రహించి రజితను నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. విచారించి న్యాయం చేయాలని బాధితులు అభ్యర్థించారు.
- కలువాయి మండలానికి చెందిన సంధ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.3.60 లక్షలు తీసుకుని మోసగించినట్లు విడవలూరుకు చెందిన గోపీకృష్ణ ఫిర్యాదు చేశారు.

నగదు ఇవ్వడం లేదు

మేము పండించిన ధాన్యాన్ని వెంకటాచలానికి చెందిన సుధాకర్‌కు ఇచ్చాం. అతను దీనికి సంబంధించి నగదు రూ.28 లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు.

– శ్రీహరి, తిరుమలనాయుడు, చేజర్ల మండలం

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

నరేష్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఇప్పుడు నరేష్, అతని కుటుంబసభ్యులు బెదిరింపు చర్యలకు దిగారు. న్యాయం చేయండి.

– ఓ యువతి, మర్రిపాడు

ఆస్తి కోసం చిత్రహింసలు

నేను కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడున్నా. కొడుకు, కోడలు ఆస్తి కోసం చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వారి నుంచి రక్షణ కల్పించాలి. ఈ వినతిపై స్పందించిన ఎస్పీ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు.

– ఓ వృద్ధురాలు, బోగోలు మండలం

క్లుప్తంగా

భర్త హత్య కేసులో భార్య అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కుమారుడిని కాపాడుకునే క్రమంలో భర్తను హత్య చేసిన ఘటనలో భార్యను నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. మెక్లిన్స్ రోడ్డులో సుభాని (48), కౌసర్‌బేగం దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ముజాజ్, సోను, ఇలియాజ్‌లు సంతానం. ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి సుభాని పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవ పడ్డాడు. పెద్ద కుమారుడు ముజాజ్ వారించాడు. దీంతో సుభాని వంటింట్లో నుంచి రోకలిబండంతో ముజాజ్‌పై దాడికి యత్నించాడు. భార్య అడ్డుపడి బలవంతంగా రోకలిబండను లాక్కొంది. సుభాని వంటింట్లో నుంచి కత్తి తీసుకొచ్చి కుమారుడిని పొడవబోతుండగా కౌసర్ భర్త తలపై రోకలి బండతో బలంగా కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి చిన్న కుమారుడు ఇలియాజ్ ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. సోమవారం కౌసర్‌బేగంను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు అరెస్ట్ చేశారు.

మార్కెట్‌లోకి నిస్సాన్ మ్యాగ్నెట్ కారు


కారు వద్ద షోరూం నిర్వాహకులు

నెల్లూరు(టౌన్): నెల్లూరు మినీబైపాస్‌లోని హైటెక్ నిస్సాన్ షోరూంలో సోమవారం మ్యాగ్నెట్ కారును ఆ సంస్థ ఎండీ జగన్నాథ్ రెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కారు అత్యాధునిక ఫీచర్లు కలిగి ఉందన్నారు. 1.0 టర్బో చార్జ్‌డ్ పెట్రోల్ ఇంజిన్, హైస్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, సీవీటీ గేర్ బాక్స్, 6 ఎయిర్‌బ్యాగ్స్ తదితర సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నిరంజన్, భారతి, హోషిమారెడ్డి, జీఎం శాస్త్రి, సేల్స్ మేనేజర్ గోపీ తదితరులు పాల్గొన్నారు.

జెన్నీ మిల్క్ నిర్వాహకుల అరెస్ట్

- నిందితుల్లో నెల్లూరు వాసి

హొసపేట: 'గాడిదలు మా వద్దనే కొనండి. ఆ పాలను మాకు అమ్మండి. ఎంతో ఆదాయం పొందండి' అని ప్రజలను మోసం చేసిన కేసులో నిందితులు ఎట్టకేలకు చిక్కారు. జెన్నీ మిల్క్ కంపెనీకి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ హరిబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరుకు చెందిన జెన్నీ మిల్క్ కంపెనీ ఎండీ నూతలపాటి మురళి (43), కడపకు చెందిన మేనేజర్లు ఉమాశంకర్‌రెడ్డి (33), సయ్యద్ మహ్మద్‌గౌస్ (27)ను అరెస్ట్ చేశారు. కంపెనీకి చెందిన ఐదు బ్యాంకు ఖాతాల నుంచి నగదును స్వాధీనం చేసుకుని ఫ్రీజ్ చేశారు.

ఏమిటీ కుంభకోణం?

కర్ణాటకలో హొసపేట నగరంలో జెన్నీ మిల్క్ కంపెనీ కార్యాలయం గత మే నుంచి ప్రారంభమైంది. ప్రస్తుతం గాడిద పాలకు చాలా డిమాండ్ ఉందని ప్రచారం సాగించారు. తమతో చేరాలని కోరారు. ఒక్కో వ్యక్తి నుంచి రూ.3 లక్షలు తీసుకుని, వారికి రెండు గాడిదలను ఇచ్చారు. పాలు తమకే ఇస్తే కొంటామని చెప్పారు. ఎంతోమంది డబ్బు కట్టి గాడిదలను తీసుకున్నారు. అలా రూ.కోట్లు వసూలు చేసిన నిర్వాహకులు ఆ తర్వాత బోర్డు తిప్పేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ సలీంపాషా, డీవైఎస్పీ మంజునాథ్ తల్వార్ గాలించి చర్యలు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

అందుబాటులో 70 వేల టన్నుల ఇసుక

- కలెక్టర్ ఆనంద్ వెల్లడి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని మూడు ఇసుక యార్డుల్లో 70 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం కలెక్టర్, ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేదని, ప్రజల అవసరాల కంటే రెట్టింపు మొత్తం అందుబాటులో ఉందన్నారు. ఒక టన్నును రూ.350కే అందిస్తున్నట్లు చెప్పారు. మన జిల్లాతోపాటు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు ఇసుకను అందించనున్నట్లు చెప్పారు. కందుకూరులో మరో యార్డును ప్రారంభిస్తున్నామన్నారు. ఈనెల 15వ తేదీ తర్వాత మినగల్లు, పడమటి కంభంపాడు, పల్లిపాడు, విరువూరులో ఓపెన్ రీచ్‌లను మొదలు పెట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు ఎవరూ ఇసుక కోసం దళారులను ఆశ్రయించవద్దన్నారు. ఏపీ శాండ్ పోర్టల్లో బుక్ చేసుకున్న వారు సొంత వాహనం ద్వారా ఇసుక తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక పక్కదారి పట్టకుండా జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీని నియమించినట్లు కలెక్టర్ చెప్పారు.

టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫెసిలిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, కోఆర్డినేషన్ టీంను సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఇసుక సకాలంలో సరఫరా అయ్యేందుకు ఇది పనిచేస్తుందన్నారు. ఇసుక ఫిర్యాదులు, సమాచారం, సందేహాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 0861 – 2943569ను సంప్రదించాలని సూచించారు.

పటిష్ట నిఘా

ఎస్పీ మాట్లాడుతూ రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు ఇసుక యార్డుల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఉంచామని, గుర్తింపు పొందిన వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

మద్యం షాపులో ఇంటి దొంగలు

- బెల్టుషాపులకు మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పట్టివేత
- ఇటీవల సూపర్‌వైజర్‌ను నియమించిన టీడీపీ నేతలు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఉలవపాడు: అక్రమార్జనకు అలవాటుపడిన ఇంటి దొంగలు మద్యం బాటిళ్లను షాపులో అమ్మకుండా బెల్టుషాపునకు తరలిస్తుండగా పట్టుకున్న ఘటన మండల కేంద్రమైన ఉలవపాడులో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఉలవపాడులో 08192 నంబర్ షాపు ఉంది. సోమవారం ఉదయం దానిని తెరిచిన తర్వాత మందుబాబులు రూ.150 క్వార్టర్ ఇవ్వాలని సూపర్‌వైజర్ కత్తినారాయణను అడగ్గా, అవి లేవని, అధిక రేటువి ఉన్నాయని చెప్పాడు. గంట తర్వాత ఒకతను రాగా షాపు లోపలి నుంచి రెండు బస్తాలను సూపర్‌వైజర్ తీసిచ్చాడు. మందుబాబులు ఆపి గోతామును తెరిచి చూడగా రూ.150కు సంబంధించిన 95 క్వార్టర్ బాటిళ్లు కనిపించాయి. దీనిపై అతడిని నిలదీయడంతో పరారయ్యాడు. మద్యం బాటిళ్లను బెల్టుషాపునకు తరలించడం కోసం కౌంటర్‌లో అమ్మడం లేదని మందుబాబులు వాపోయారు. వివాదం చెలరేగడంతో పోలీసులకు సమాచారం అందింది. రైటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కందుల శ్రీనివాసులు, కానిస్టేబుల్ బ్రహ్మయ్యలు ఘటనా స్థలానికి చేరుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. త్వరలో ప్రైవేట్ షాపులు రానుండడంతో సూపర్‌వైజర్లు స్టాక్‌ను బెల్టుషాపులకు అమ్ముకుని అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ సూపర్‌వైజర్‌ను ఇటీవల టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించారు. అధికారం అండతో చేస్తున్న ఈ నిర్వాకంపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది.

మృతుడు నెల్లూరు వాసి

- గుర్తించిన కుటుంబసభ్యులు


విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహం (ఫైల్)


మనుబోలు: మండల పరిధిలోని వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన బస్‌స్టాప్‌లో పదిరోజుల క్రితం చనిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్సై రాకేష్ సోమవారం తెలిపారు. వ్యక్తి మృతిపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో అతడిని నెల్లూరు ధనలక్ష్మీపురం ప్రాంతానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి (30)గా భార్య శ్రావ్యరెడ్డి ద్వారా గుర్తించారు. అతడికి గతంలో ప్రమాదం జరిగి తలకు దెబ్బ తగలడంతో శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. తరచూ ఫిట్స్ కూడా వచ్చేవి. కొంతకాలం క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోగొట్టుకున్నాడు. గత నెల 21వ తేదీన ఇంటి నుంచి వెళ్లి చెన్నై, సేలం తదితర చోట్ల తిరిగాడు. 28వ తేదీ చెన్నై నుంచి నెల్లూరుకు వచ్చేందుకు ఆటో మాట్లాడుకున్నాడు. దారిలో మనుబోలు వద్ద తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో బస్‌స్టాప్‌లో దిగేశాడు. గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. విష్ణువర్ధన్‌రెడ్డికి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా ఆచూకీ తెలియకపోవడంతో మృతదేహాన్ని వారం రోజుల క్రితమే పోలీసులు గూడూరులో ఖననం చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వరికుంటపాడు: నెల్లూరు అక్కచెరువుపాడులోని ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఫిజికల్ సైన్స్, పీఈటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్, కన్వీనర్ గల్లా మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ నిబంధనల ప్రకారం డెమో నిర్వహించి అర్హత సాధించిన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తులను పాఠశాలలో అందించాలన్నారు. ఇతర వివరాలకు 87126 25045 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.80
సన్నవి	రూ.40
పండ్లు	రూ.30



వాకాటికి సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

- సీబీఐ పేరిట రూ.15 కోట్ల డిమాండ్
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త తరహాల్లో నేరాలకు పాల్పడుతున్నారు. తాజాగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డికి ముంబై సైబర్ క్రైమ్, సీబీఐ అధికారుల పేరిట ఫోన్ చేసి మీపై కేసులున్నాయి. రూ.15 కోట్లు ఇస్తే బయట పడేస్తామని డిమాండ్ చేశారు. దీనిపై ఆయన సోమవారం నెల్లూరు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. వెంకటరెడ్డినగర్‌లో వాకాటి నారాయణరెడ్డి నివాసం ఉంటున్నారు. గతనెల 27వ తేదీన ఆయన విజయవాడలో ఉండగా ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ఫెడెక్స్ నుంచి మాట్లాడుతున్నానని, మీ పేరుపై పార్శిల్ ముంబై నుంచి థాయ్‌లాండ్‌కు పంపామని, అందులో పాస్‌పోర్టు, వస్త్రాలు, బ్యాంక్ కార్డులు, ల్యాప్‌టాప్, 200 గ్రాముల మాదక ద్రవ్యాలు, ఆరు వేల యూఎస్ డాలర్లు ఉన్నాయని చెప్పాడు. తాను ఎవరికీ పంపలేదని వాకాటి చెబుతుండగానే అతను కాల్‌ను ముంబై సైబర్‌క్రైమ్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేస్తానని, అక్కడ ఫిర్యాదు చేయాలన్నాడు. ఈ విషయాన్ని నమ్మిన వాకాటి వారి సూచనల మేరకు వీడియో కాల్ చేసి ఆధార్ చూపించగా లైన్‌లో ఉండాలని.. కొద్దిసేపటి అనంతరం మీ పేరుపై మనీలాండరింగ్, సీబీఐ కేసులున్నాయని చెప్పారు. అవి వ్యాపారరీత్యా నమోదైన కేసులని ప్రస్తుతం కోర్టులో ఉన్నాయని వాకాటి వారికి వివరించారు. ముంబైకు చెందిన ఓ మంత్రి మీ పేరుపై ఖాతా తెరిచి మిలియన్ల నగదు అకౌంట్‌లో వేశారని సైబర్ క్రైమ్ విభాగ అధికారులు తెలుపగా బ్యాంక్ అకౌంట్లని ఫ్రీజ్‌లో ఉంటే కొత్త అకౌంట్ తెరవడం ఎలా సాధ్యపడుతుందని నారాయణరెడ్డి ప్రశ్నించారు. మీ అకౌంట్‌లో డబ్బులు వేసిన వారి నుంచి ప్రాణాపాయం ఉందని, సెల్ఫ్ కస్టడీలో సూచించారు. బ్యాంక్ ఖాతాలు, కేసులను చెప్పి ఆయన్ను ఈనెల 4వ తేదీ వరకు ఇబ్బందులు పెట్టారు. ఓంకార్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను సీబీఐ డీఎస్పీనని, రూ.15 కోట్లు ఇస్తే ఈ వ్యవహారాల నుంచి బయటపడేస్తానని చెప్పాడు. తన వద్ద డబ్బు లేదని వాకాటి చెప్పిన వెంటనే అడ్డగోలు కేసులు పెడతామని, టాడా కేసు కూడా నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. ఇదంతా సైబర్ నేరగాళ్ల పనేనని భావించిన వాకాటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


వైఎస్సార్ విగ్రహం చేతిని విరగ్గొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

వరికుంటపాడు: మండలంలోని తోటల చెరువుపల్లి గ్రామంలోని బస్టాండ్ సమీపంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చేతిని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం విరగ్గొట్టారు. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డారని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉదయగిరి ఏఎంసీ మాజీ డైరెక్టర్ దాసరి యర్ర ఓబయ్య తెలిపారు. పట్టపగలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయమై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 134
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 264
లేయర్ చికెన్	: 187

పోక్సో కోర్టు సంచలన తీర్పు

- లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

నెల్లూరు(లీగల్): పన్నెండేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్టు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ సోమవారం సంచలన తీర్పు ఇచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కథనం మేరకు.. ఓ మహిళ భర్త నుంచి విడిపోయి తాతలపూడి వెంకటరమణ అనే వ్యక్తితో కొడవలూరు మండలం యల్లాయపాళెం బొమ్మర కాలనీలో ఉండేది. కూలి పనులకు వెళ్తూ ఇద్దరూ సహజీవనం సాగించేవారు. సదరు మహిళ కుమార్తె రామాపురంలోని స్కూల్లో ఐదో తరగతి చదివేది. 2022 సంవత్సరం జూలై 31న బాలిక కడుపునొప్పితో బాధపడుతూ ఉండగా తల్లి విచారించింది. ఆమె లేని సమయంలో, నిద్రిస్తున్న సమయంలో వెంకటరమణ పలుసార్లు లైంగికదాడికి పాల్పడినట్టు చెప్పింది. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు దర్యాప్తు చేసి నిందితుడిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం 39 ఏళ్ల వయసున్న వెంకటరమణపై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ దువ్వూరు శైలజారెడ్డి వాదించారు.